# గంటుల మేస్టారు

ఈరోజుల్లో మగాళ్ళ నందర్నీ మీది టెక్నికల్ సైడా మామూలా అని అడగడం కద్దు, యమ్మెస్సీ చదుకున్న గుంటనైనా "అమ్మాయీ నీ కెందరే పిల్లలు" అనడుగుతారు. కాని నీది టెక్నికల్ సైడా అని అడగ రడగరు. మగాడ్ని చూడగానే వీడెంత డబ్బు సంపాదిస్తాడూ (సంపాదించ గలడూ) అనే చూస్తారు. కాని మరోటి మరోటీ (అందగాడా పేరు శేఖరా రాజశేఖరా అని) చూడరు. వడుచు పిల్లను చూడగానే మెళ్ళో పుస్తెలు మిల మిల లాడగానే యిది ఎంత మంది పిల్లల్ని కంటుందీ కనగలదూ, కన్నదీ తెలుసుకోవాలని తహ తహలాడి పోతారు. ఇల్లును చూడగానే ఎంత అద్దె వస్తుంది అని అడుగుతారు. గేదెనుకాని ఆవునుకాని చూడ గానే యిది ఎన్ని పాలిస్తుందీ ఎన్ని యీతలు యీనిందీ అని భోగట్టాలు చేస్తారు.

కొబ్బరిచెట్టును కాని. మరేదైనా పళ్ళచెట్టునుగానిచూడగానే కాపు ఎంత అని అడుగుతారు అలాగే కాఫీ హోటల్ను చూడగానే యిక్కడ ఇడ్లీ సైజు ఎంత వుంటుంది, కాఫీ బాగుంటుందా అనే సందేహం వస్తుంది. ఈ లోకంలో ఒక మానిషికాని వస్తువుకాని మనకు ఎంత వరకు ఉప

యోగిస్తుందీ? అది మనకు లాభమా నష్టమా అనే యోచిస్తారుకాని మిగతా సంగతులన్నీ అనెన్నెసరీ.

కాని యిప్పుడిప్పుడే మన గృహ రాజ్యసీమలో కొత్త మార్పులు వస్తున్నాయి. టెక్నికల్, నాన్ టెక్నికల్ అని వంటింట్లోంచి కూడా వినిపిస్తోంది. గృహ టెక్నిక్స్‌ని అక్షరాలా అమలుపరచేది ఆడది కాబట్టి అటువంటి గృహరాక్షసిని, 'హోమో టెక్నికల్' అనొచ్చు (అలా వీల్లేని పక్షంలో టెక్నికాళీ ! టెక్నికల్ రూపం ధరించిన ఆడకాళి అన్నా బైనోమీన్స్ ఫరవాలేదు) ఎవరెన్ని చెప్పినా మన వంటింటి సామ్రాజ్యంలో మగాడు కేతిగాడున్నూ ఆడది బంగారక్కాను. సారాచెంబు తాడులాగేది యిక్కడ మగాడు తలపూపేది పెళ్ళాం అనేటువంటి దినుసు (ఇంకా మీకర్థంకాలేదా. అయితే మీదికూడా మా వారిదిలానే మట్టి బుర్ర. యాష్ట్రే అనగా దుమ్ము తట్టదాన్ని దులిపితే మరేవీరాలదు.) నేను చాలా టెక్నికల్‌గా నడుస్తున్నట్లున్నాను. ఏవీ లేదండీ....యథా రాజా తథాప్రజా అన్నట్లు యథా మొగుడు తథాభార్యా అన్నారుకదా. చిన్న యగ్జాంపుల్... మొగాడు ఇంజన్ డ్రయిరయితే వవాడి ఆడది వాడిలో సగం కనుక (అర్థాంగి) అది కూడా సగం డ్రయివరయి తీరుతుంది. భర్త ఇంజనీరయితే భార్య హాఫ్‌యాన్ ఇంజినీర్, మరియు భర్తగాడు ఏదైతే అందులో భార్య ఫిఫ్టీ..ఫిఫ్టీ కావాలిగదా. అదే అవుతోంది. అమ్మతల్లి చల్లగా తీయగా అనగా చాలా మంది సో సో లేడీస్ మగాళ్ళకి అచ్చోసిన డూప్లికేట్లు. అందుకే ఏ గూటి చిలక ఆగూటి పలుకు పలికినట్లు ఏ మగాడి వైఫ్ ఆ మగాడి లైఫ్ గురించి టాకింది టాకకుండా టాకుతుంది. పందిరి మంచం గురించీ, పవ్వళింపు సేవల గురించీ, పట్టు చీరల గురించీ చెప్పుకున్నట్లే తమ తమ భర్తల గురించి పతిభక్తి రంజకంగా చెప్పింది చెప్పకుండా చెప్పుకుపోగల్రు సోమెనీ లేడీస్. పూర్వం ఇళ్ళన్నీ కులం వాసన కొట్టేవి. ఇప్పుడూ కులం వాసన కొట్టినా వృత్తి వాసనే ఎక్కువ మన కొంపల్లో.. ఇంజినీరుగారి పిల్లలకు కంట్రాక్టరూ, బ్రిడ్జిలూ, ఎర్త్ వర్కూ, సిమెంట్ కాంక్రీటింగ్, ఎస్టిమేట్లూ, ఫైనలు బిల్లులూ, పరసంటేజీలూ కరతలామ

లకం కదా. అదే పరిభాష వారింట్లో మార్మోగుతూ వుంటుంది. హైదిబై మాస్టర్లిళ్లలో మార్కులు, పరీక్షలు, పుస్తకాలు, నోట్సులూ, సెలవల టాపిక్కులే చెల్లుబడి అవుతూ వుంటాయి. జర్నలిస్టు పెళ్ళానికి డబల్ కాలం హెడ్డింగులూ, సింగిల్ కాలాలూ, హాఫ్‌టోన్, లైన్ బ్లాకులూ, కటవుట్, టెల్వ్‌పాయింట్, రన్నింగ్ మేటర్, పేజెస్ అంటే బాగా తెలుస్తాయి. రైల్వే వాళ్ల పిల్లలకి అప్ ట్రెయినులూ, డవున్ ట్రెయిన్లూ, స్టేషన్‌కోడ్లూ, డ్యూటీ అవర్లూ, జీరో అవరూ, ఫస్ట్‌నైట్, సెకండ్‌నైట్



అంటే ఆ భాష వారికే తప్ప తదితరులకు సుళువుగా అర్థమయి చావదు.

ఏం లేదు మన జీవితం క్రమేపీ చాలా టెక్నికల్ అయిపోతోంది. ఈ వాతావరణానికి అకస్మాత్తుగా అడ్జస్టు అయిపోవాల్సిన అవసరం ఆడదానికి పట్టింది. డాక్టరు పెళ్లానికి రోగాల గురించీ మందుల గురించీ వాటి చికిత్స, గురించీ తెలిసినట్టు మరోళ్ళకీ మరోళ్ళకీ ఎలా తెలుస్తుంది? తెలీ

తెలీదు. ఇలాటి సరుకంతా ఒక ప్లాట్ ఫారం మీదకు చేరితే అది ఒక అపూర్వ ప్రహసనం మాదిరి నవ్వు పుట్టిస్తుంది.

ఆడాళ్ళ ప్రపంచం వేరు, ఆడవాళ్ళ ప్రపంచం వేరని అంటారు కాని ఆ ప్రపంచంలో కూడా వాళ్ళు పాపం హర్ మాస్టర్స్ వాయిస్తే, అయ్యో పిల్లాడు టిఫిన్ తినకుండా వెళ్ళాడే, ఆయన అన్నానికి రాలేదే అని పెళ్ళాం అనుకుని బాధపడిపోతుంది.

కాని పెళ్ళాం అన్నంతిందా లేదా అని ఏ మగాడూ అడగడు. వంటింట్లో కూర్చుని తింటుంది. తినకేంచేస్తుందనే దృక్పథంతోటే వుంటాడు. అది నైటవనివ్వండి రాంగవనివ్వండి అదంతే. (ఆ దర్జాకే ఆడది దాసోహమంటుంది.)

మా దొడ్డి గుమ్మంవైపు బాదంచెట్టు పక్క వాటాలో గంతుల మేష్టారని వుండెవారు. ఆయన చేసేది మాస్టరీ వుద్యోగమైనా తెల్లారి లేచింది మొదలు అన్నిటికీ కేకలూ గంతులే. అతడలా నిప్పుతొక్కిన కోతిలా ఎగుర్తూంటాడా ఆ మహా ఇల్లాలు మాత్రం తొణక్కుండా బెణక్కుండా చిరునవ్వులు నవ్వుతూ నిమ్మకు నీరెత్తినట్లుండేది. పైగా ఎవరైనా స్టూడెంట్స్ వస్తే వారితో బాతాఖానీలు వేస్తూ మీ గంతుల మేష్టారేవంటున్నారనేది. ఆ విధంగా ఆ చిరునామధేయం స్కూల్లో వ్యాపించే సరికి దాని పుట్టుపూర్వోత్తరాలు తవ్వివ వారికి మేష్టారి మిస్సెస్సే ఆ పేరు పెట్టిందని తేట తెల్లమయింది. తెల్లారి లేస్తూనే గంతుల మేష్టారు "నీ మొహం మండా అప్పుడే తెల్లారిందే." అంటూ లేచేవాడు. ఓసి నీ అమ్మ కడుపు మాడా, "నీ మొహం ఈడ్చా"— నీ తల్లి బొడ్డు పొక్క"— అంటూ యాకరువు పెట్టేవారు. ఇప్పుడు ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం అధికమయినందున మన అధునాతనిక్స్ రాస్కెల్, ఇడియట్, యాస్, లిటిల్ స్కౌండ్రల్ అని తిడుతూ వచ్చారు, కాని వైదీకపు తిట్ల ముందర ఇంగ్లీషు తిట్లు వేదమంత్ర ఘోష జరుగుతూండగా ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ చదివినట్లుంటుంది.

గంతుల మేష్టారి విషయం ఎందు కొచ్చిందంటే గంతుల మేష్టారి సతీమణిలాగా మన లేడీస్ మగాళ్ళని అట్టే కేర్ చేయకుండా వాళ్ళ ఇన్ అండ్ అవుట్స్ కనిపెట్టి నొక్కవలసిన చోట గట్టిగా నొక్కాలి.

అసలు ఆడాళ్ళు హిజ్ మాస్టర్స్ వాయిస్ ప్లేట్ మీదుండే కుక్కల్లాగా వుండకూడదని చెప్దామని సోది మొదలెట్టాను. మధ్యలో గంతుల మాష్టారొచ్చి మన టాపిక్ చెడగొట్టారు. చెడగొడితే చెడగొట్టారు కాని గంతుల మేషారి పెళ్ళావు లేడీస్‌లోకెల్ల చెప్పుకోతగ్గలేడి. అస్సలావిడే గొప్ప డాంకేరు మాస్టారు. అల్లక్కడ శ్రీకృష్ణుడొచ్చాడు. రథం దిగి అర్జునుడికి గీతోపదేశం చేస్తున్నాట్ట. మనం కూడా విందామా వెళ్ళి పిన్నిగారూ వస్తారా అంటే ఐ డోంట్ కేర్ అంటుంది. నచ్చే లేడీతో స్నేహం నిజంగా వండరాఫ్ వండర్స్....గంతుల మేష్టారి పెళ్ళాం పేరు చెప్పమంటరా....నో....నో....చెప్పను. ఆవిడ ఫ్రండ్‌షిప్ అనగా స్నేహితప్పోడను ఐ వాల్యూ మోస్ట్ నేను అనిటికన్నా మిన్నగా భావిస్తాను.